

గురుకృప
భావనకు.. బలం
శ్రీరామనవమి సంచిక
గురో వినతిమీ కరీ హృదయ మందిరీ యా బసా! సమస్త జగ్‌హే గురు స్వరూప చీ రసో మానసా!
కరో సతత సత్కృతీ మతిహిదే జగత్పావనా!



# సాయివంటి దైవంబు లేడోయి... లేడోయి...

ప్రజలందరి నోట సాయినామం పలకాలి!
సర్వత్రా సాయిరూపం రంజిల్లాలి.
ముజ్జగాలు సాయి మహిమతో ముప్పిరిగొనాలి!
సాయిపద రవళులు మన హృదయ కుహరంలోని నిశ్శబ్ద నిశీథిలో
ప్రతిధ్వనించాలి. ప్రణవనాద వీచికల్లా సాయిజ్ఞాన సౌరభాలు
సర్వత్రా వ్యాపించాలి. ఆ సుజ్ఞాన సౌరభాల ఆస్వాదనలో
మన మనసులు మత్తెక్కాలి!
సాయి ప్రేమామృత ధారలు అంతటా నిరంతరం వర్షించాలి!
ఆ ప్రేమామృత ధారలలో తడుస్తూ, ఆ జ్ఞాన సౌరభాల మత్తులో
ఆనందంగా నర్తిస్తూ, 'సాయివంటి దైవంబు లేడోయి లేడోయి!'
అని అందరూ ఏక కంఠంతో గానం చేయాలి!
అదే నా ఆశ, ఆశయం, ఆకాంక్ష! అదొక మధుర స్వప్నం.
ఆ స్వప్న సాఫల్యం కోసం శ్రీ సాయినాథుని అనన్య ప్రేమతో ఆర్ద్రతతో
ప్రార్థించడమే మనం చేయగలిగింది, చేయవలసింది.

\- శ్రీ బాబూజీ

## లీల ~ పుట


| | | | |
|---|---|---|---|
| 1. | సాయివంటి దైవంబు లేడోయి..లేడోయి... | శ్రీ బాబూజీ | 2 |
| 2. | ఉన్నమాట - అనుకున్నమాట | గురుబంధువులు | 3 |
| 3. | కలయా... నిజమా... ఏమి భాగ్యము... | రాధిక, సంతనూతలపాడు | 5 |
| 4. | అంతటా నిండిన సాయి పాదం | గాయిత్రి అనిల్, హైదరాబాద్ | 7 |
| 6. | సాయి చూపిన ప్రగతి పథము | కె. జానకి, విజయవాడ | 9 |
| 7. | నీవే మము కాపాడు ఏలిక - | పద్మ, తెనాలి | 9 |
| 8. | చూపుదాపుల హేల... నీ దివ్య లీల! | యస్. రామ్ కుమార్, తెనాలి | 10 |
| 9. | ఏది శిరిడీ - ఏది నీ ఒడి | రాజ్యలక్ష్మి శాఖమూరి | 12 |
| 10. | సత్య సంకలనాలు.. | సత్య | 16 |
| 11. | సాయి భక్తులకు బ్రతుకంతా శోభప్రదం | ప్రమీల, విజయవాడ. | 18 |

సంపుటి : 11
సంచిక : 2

త్రైమాసిక పత్రిక
ఏప్రియల్ 2008

<u>నిర్వహణ</u>

గురూజీ
ఆశీస్సులతో
గురుబంధువులు

<u>చిరునామా</u>

గురుకృప
2-1-6,
గాంధీచౌక్,
తెనాలి-01

ఫోన్:

08644-227194

<u>ముద్రణ</u>

రామకృష్ణ ప్రింటర్స్
విశాఖపట్నం

ఫోన్స్ :
2798072
2740222


**శ్రీ సచ్చిదానంద సద్గురు సాయినాథ్ మహరాజ్‌కీ జై!**
**సద్గురు శ్రీ సాయినాథుని శరద్బాబాజీకీ జై!**

# గురుకృప

## ఉన్నమాట - అనుకున్న మాట

అది డిసెంబరు 30వ తేదీ రాత్రి 8.30 ని॥లు. సాయి పథం ప్రాంగణం – శిరిడీ! హేమంతపు చల్లదనం ప్రతి గురుబంధువు శరీరాన్ని చల్లని తెమ్మెరలా పలుకరించి, సాయినామఝరిలో వెచ్చగా సేదతీరమని తెలియచెపుతోంది. 'గురుచరణ్' నుంచి వేంచేసే ఆ దేవాధిదేవుని చరణ కమలాలను స్పృశించాలని, ఆ రూపుగాంచి తనివితీరా తమకున్న వెతలను వెల్లడించి, వారిని వేడుకోవాలనే తహతహ తనువులను మరింత వెచ్చగా మార్చుతోంది. సాయిసత్సంగం చివరి అంకానికి వచ్చింది. ఎలుగెత్తి సాయిని పిలిచే పిలుపులు ఒక ప్రక్క, మా హృదయ మందిరపు తలుపులు తీసి ఉంచాం – ఆసీనులు అయ్యి, మమ్ము ఆశీర్వదించమనే తలపులు ఒక ప్రక్క!. గురుదేవులు వేంచేసే ఆ మధుర క్షణాలను మరచిపోలేని మధురానుభూతిగా మలచుకోవాలని సాయిని మనసారా ప్రార్థించే పెదవులు కొన్ని! గురుదేవులు గురుచరణ్ నుంచి సాయిపథం ప్రాంగణం వరకు వేసే ప్రతి అడుగును దేదీప్యమానంగా మలచాలని తపించి శ్రమించే తనువులు ఇంకొన్ని. గురుబంధువుల పిలుపులు ఆ మహితాత్ముని మదిని చేరగా అడుగులో అడుగువేసుకుంటూ గురుచరణ్ నుంచి బయలుదేరి సాయిపథం ప్రాంగణానికి వేంచేసారు గురుదేవులు. సాయినామ సంకీర్తనలో లీనమయ్యేలోపున ఆ ప్రాంగణంలోని అణువణువు వారి నిశిత దృష్టితో పునీతమయ్యింది. ఆ చూపులోని ఆంతర్యం, నాటి సాయిమాటలే గుర్తొస్తాయి. "ఈ మూడున్నర మూరల దేహాన్నే మీరు 'సాయి' అనుకుంటే పొరపడినట్లే"! నా చూపుకు అందనిది లేదన్న గురుదేవుల చూపు ప్రతీ గురుబంధువు మనోఫలకంపై ముద్రించుకుపోక మానదు. ఇంతలో ఆ మహితాత్ముని వాక్కులు మస్తిష్కంలో ఇలా మెదిలాయి. "మీరు అమెరికాలో ఉండి సత్సంగం చేసుకుంటున్నా నాకు

తెలుస్తుందయ్యా!". "ఏదో చీకట్లో ఈయన వస్తున్నాడు, పోతున్నాడనుకుంటే పొరపాటే! ఏ మనిషి ఎప్పుడు, ఎక్కడికి వచ్చాడు, చివరకు ఏ వరుసలో ఎక్కడ కూర్చున్నాడనే విషయంతో సహా ఇక్కడ రికార్డు ఉందంటూ" వారు తన అరచేతిని చూపిన సందర్భం స్మృతిపథంలో తళుక్కున మెరిసింది. చూస్తుండగానే గడిచిపోయింది సమయం. గురుదేవులు లేచి సాయికి నమస్కరించి మెల్లగా నడక ప్రారంభించారు గేట్ బయటకు రాగానే ఒక యువకుడు **'సార్!'** నా అపాయింట్‌మెంట్ లెటర్ అంటూ ఆశీస్సులు కోరాడు–తన కరస్పర్శతో ఆ లెటర్‌ను పావనం చేసారు గురుదేవులు.

వడివడిగా పడుతున్న ఆ అడుగులను గమనిస్తూనే నెల్లూరు నుంచి వచ్చిన ఒక పెద్దావిడ '**బాబూ**' ఈ మధ్య నాకు ఆరోగ్యం బాగుండటం లేదు. మీ దయవల్ల నా ఆరోగ్యం... అంటూండగానే 'బాబా ఉన్నారమ్మా' అంటూ ఓదార్చి, దీవెనలు! **గురూజీ** నాకు మంచి సాఫ్ట్‌వేర్ కంపెనీలో స్థిరపడాలని ఉంది. మీ అనుగ్రహాన్ని నాపై కురిపించండంటూ ఒక యువకుడు. కొంతదూరం అలా వెళ్లగానే 'అయ్యా'! నా బిడ్డకు అన్ని విధాలా తగిన సంబంధం చూసి పెళ్లి చేయాలని ఉంది– మీ ఆశీస్సులు మా కుటుంబానికి కావాలంటూ మరొక తండ్రి, ఇంతలో **'అంకుల్'!** నాకు ఫైనల్ ఎగ్జామ్స్‌లో 90% మార్కులు వచ్చేట్టుగా దీవించండి అంటూ మరొక చిన్నారి. ఇక్కడ ఇంకొక విషయం – గురుదేవులతో జరిగే సత్సంగంలో **'గురువుగారూ!** ఇదీ... నా సందేహమంటూ "చిన్నారి **శృతి** అడిగిన ఆ పిలుపు. ఇలా గమనించుకుంటూ పోతే ఏది ఆయన నామం... నామధేయం... ఏ పిలుపుకు ఆయన పలుకుతున్నారు, తన వరద హస్తాన్ని తన బిడ్డలకై చాచి ఎలా ఆదుకుంటున్నారో అవగతమవుతుంది. నిజానికి ఏది ఆయన పేరు... పేరు మరచిన ప్రేమ తత్త్వానిది ఏ పేరు... ఈ జగానికి వెలుగులు పంచే జగద్రక్షకునిది ఏ పేరు... "సాయి అంటే ఓయీ" అని పలికే ఆ సమర్ధ సద్గురుని కటాక్ష వీక్షణాలను అలవోకగా, అందరికీ పంచుతున్న అనుగ్రహరారాజుది ఏ పేరు... ఆ ప్రేమతత్త్వాన్ని ఆస్వాదించాలని, ఆ మాధుర్యాన్ని ఆసాంతము అనుభవించాలనే తపనతో పిలిచే ఏ పేరైనా అది ఆయనదే!

సాయిపథగాములై సాగే ప్రతి సాయిభక్తుడు అలా పేరు మరచి ఆ ప్రేమతత్త్వమే తామవ్వాలనే తపనతో గురుదేవులు ప్రసాదించిన వరం సత్సంగం. వారిలా అంటారు "ఎవరూ కూడానూ వాళ్ల అహాన్ని, పరపతిని పెంచుకునేదానికి సత్సంగానికి రారు, వాళ్ల అహాన్ని పోగొట్టుకోవడానికి సత్సంగానికి రావాలి. మనం సత్సంగం చేసుకుంటున్నామంటే అలా మనలో ఆ అహం పోతుందా? లేదా! అన్నది బేరీజు వేసుకోండి. పోతుంటే అది సత్సంగం. పోకపోతే అది సత్సంగం కాదు". అయితే ఇక అహం పోగొట్టుకోవాలనే ప్రయత్నం చేసుకుంటూ పోదామా! అలా అనుకుంటూ పోతే పోతుందా అహం. ఆలోచిద్దాం. మరల గురుదేవుల మాటలే గమనిద్దాం, మనకు అవే కదా వేదోపబృంహణాలైన ఆఖ్యానాలు.

'ప్రేమ'లో 'మనల్ని' మనం కోల్పోతాము. ఆ కోల్పోవడంలో "ఉన్నతిని పొందుతాం" అంటారు గురూజీ. కనుక పూజ్య గురుదేవులు మనకు అందించిన సాధనం 'ప్రేమ'. ఎటువంటి ప్రేమ? ఎంతటి ప్రేమ? ఏమిటి దానికి ప్రామాణికం? దాని పరిధి ఎంత? అసలు అది ఎలా ఉంటుంది? నేర్వడం ఎలా? నేర్చుకుంటే అలవడేదేనా? ఏమైనా ఉదాహరణలు? ఎవరైనా మార్గదర్శులు? ఏది – ఎక్కడైనా ఆచరణపూర్వకంగా నిరూపణ గావించిన వ్యక్తులు? మీలో కూడా ఈ సంఘర్షణ మొదలయ్యింది కదూ! ఈ సంఘర్షణ మస్తిష్కంలో బలంగా సాగింది. కనిపించిన చరిత్రలన్నీ చదువుతూ పోతున్నా, దృశ్య, శ్రవణ సాధనాలలో కనిపిస్తున్న అడ్రస్సులన్నీ వెతుకుతున్నా, అంతులేని తంతు తప్ప 'ప్రేమ' జాడ ఎక్కడా లేదు.

ఇక ఎదురుగా ఉన్న సద్గురు స్వరూపం గురించి ఆలోచన సాగడం మొదలయ్యింది! ఇంకేముంది, మస్తిష్కపు వేగం మందగించింది. స్థిరచిత్తానికి సద్గురు చిత్తరువు స్ఫురణకు వచ్చింది. గురుదేవుల జీవితమే ప్రేమకు నిర్వచనమని తోచింది. వారి చిన్నతనం నుంచి ఉన్న గురుబంధువులు, సాయి ఋణానుబంధీకుల నందరినీ అడుగుతూ వచ్చా! ఎన్నో సంఘటనలలో పాత్రలుగా ఉన్న గురుబంధువులందరిదీ ఒక్కటే మాట! "ఆయన జీవితమంతా పంచింది ప్రేమ, ఆ ప్రేమకు దాసోహమవ్వని జీవి ఈ జగత్తులో లేదు". అంటూ ఒకరు, "శరణన్న వారికే కాదు, తనను కాదన్న వారికి కూడా ప్రేమను పంచిన మహోన్నతతత్త్వం శ్రీ బాబూజీది అంటూ మరొకరు, ఇలా ... ఎలా మాటల్లో చెప్పగలము. గురుబంధువుల్లారా! మీ అందరితో గురుకృప చేసే విన్నపమిదే!

ఆ గురుదేవుల ప్రేమతత్త్వపు మాధుర్యపు రుచిని చవి చూసిన మనం మన చుట్టూ ఉండే వారందరికీ 'ప్రేమ'ను పంచుదాం. వారి ఆచరణ ద్వారా మనకు బాటను చూపిన ఆ మహనీయుని బిడ్డలుగా ప్రేమతత్త్వంలో 'పేరు'ను మరచి ఈ సర్వధారి నామ సంవత్సరంలో సద్గురు అనుగ్రహమకుటధారులమై చల్లగా సాగుదాం. గురుచరణాల చెంత సేదతీరుదాం. **– గురుబంధువులు**

## కలయా... నిజమా... ఏమి భాగ్యము...

కలలు కొన్ని అందమైనవి. అలా జరిగితే బాగుండునని అనిపించేవి కొన్ని, ఇలా జరిగే అవకాశముందా అని సందిగ్ధ పరిచేవి కొన్ని. నిట్టూర్పును మిగిల్చేవి ఇన్ని. అందమైన అనుభూతులు కొన్ని, అనుగ్రహ కలబోతలు కొన్ని. ఇలలో వరదాయిగా మన జీవితాలను పావనం చేసిన సద్గురుమూర్తి కలలోకి వస్తే ఇంకేముంది? ఆనందమే ఆనందం. ఇంకొంచెం ముందుకు వెళితే ఆ మహాత్ముని పావన స్పర్శ కలలోనైనా, ఇలలో అయినా మహద్భాగ్యమే కదా! మహాత్ముల స్వప్న దర్శనం వారి సంకల్ప మాత్రముననే జరుగునని శాస్త్ర వాక్యం, మహాత్ముల వాణి. తన కల నిజమయ్యిందని... కోరికగా

మిగిలిపోతుందనుకున్నది సాధ్యమయ్యిందని మనందరితో పంచుకుంటున్న ఈ అనుభవం ... కల, నిజం, వీటికి తోడుగా గురుదేవుల చిరునగవు.

పూజ్య గురుదేవులకు పాద నమస్కారములు చేసుకుంటూ గురుదేవులు నాకు ఇచ్చిన అనుభవాన్ని గురుకృప ద్వారా గురుబంధువులతో పంచుకుంటున్నందుకు చాలా సంతోషంగా ఉన్నది. నా పేరు రాధిక. మాది సంతనూతలపాడు. మా ఊరిలో సత్సంగం ప్రారంభం అయినప్పటి నుండి నేను సత్సంగానికి వెళుతున్నాను. 2001వ సం॥లో నేను మొదటిసారి శిరిడీ వెళ్లాను. నాకు గురువుగారి పాద దర్శనము చేసుకునే భాగ్యం కలిగింది. మరలా నేను 2003 సం॥ గురుపూర్ణిమకు, విజయదశమికి శిరిడీ వెళ్లాను. కాని, గురువుగారి పాదదర్శనము లభించలేదు. అప్పటి నుండి నాలో ఒక కోరిక మొదలైంది. గురువుగారు కూర్చొని ఉన్నప్పుడు కాకుండా నిలబడి ఉండగా ఆ మహనీయుని పాదాలకు నమస్కారం చేసుకోవాలని. ఆ సమయంలో నాక ఒక కల వచ్చింది. ఆ కలలో గురువుగారు బాబా నామంలో పాల్గొనేందుకు సాయియానాకు వచ్చి తిరిగి గురుచరణ్‌కు వెళ్లినపుడు గురుచరణ్ మెట్లమీద గురువుగారు నిలబడి ఉన్నప్పుడు ఆ మహాత్ముని పాదాలకు నమస్కారం చేసుకున్నాను. నా కోరికను గురువుగారు స్వప్నంలో తీర్చారు అని సంతోషపడ్డాను. కానీ ఆ కల నిజమవుతుందని నేను ఊహించలేదు. 2004 సం॥ మే 27న నా కల నిజమైంది. 2004 సం॥ మేలో అనుకోకుండా నేను, నా స్నేహితులతో కలసి శిరిడీ వెళ్లాను. మే 27న నా పుట్టినరోజు. ఆ రోజు గురుబంధువుల వివాహాలు కనుక గురువుగారు స్టేజిమీదకు వచ్చినపుడు గురువుగారి పాద దర్శనం లభిస్తుందేమోనని నా పుట్టినరోజు విషయం నరేంద్రన్నకు చెప్పాను. అన్న, సరే చూద్దాం అన్నారు. గురువుగారు గురుచరణ్ నుండి సాయియానాకు వచ్చారు. కొంత సమయం తరువాత గురువుగారు తిరిగి వెళుతుంటే పాదదర్శనం లభించలేదని అక్కడే ఏడ్చేసాను. గురుచరణ్ దగ్గరైనా గురువుగారి ఆశీస్సులు తీసుకుందామని గురుచరణ్ దగ్గరకు గురువుగారి కంటే ముందుగా వెళ్లాను. అక్కడ అనుకోకుండా లోపలకు వెళ్లి నిలబడే అవకాశం లభించింది. అప్పుడు గురువుగారు లోపలకు వస్తూ గురుచరణ్ మెట్లు ఎక్కుతుండగా 'గురువుగారు' అని పిలిచాను. గురువుగారు వెనుకకు తిరిగి చూడగా, "గురువుగారూ! ఈ రోజు నా పుట్టినరోజు" అని చెప్పి ఆ మహానుభావుని పాదాలకు నమస్కారం చేసుకున్నాను. గురువుగారు నావైపు చూసి చిరునవ్వుతో ఆశీర్వదించారు. అపుడు నాకు కలిగిన ఆనందాన్ని మాటలలో చెప్పలేను. నా కోరికను గురువుగారు ఇంత త్వరగా తీర్చారు అంటే ఇప్పటికీ నాకు ఆశ్చర్యంగా అనిపిస్తుంది. ఆశ్చర్యం కాదు, చెప్పలేనంత ఆనందంగా ఉన్నాను. ఆ రోజున గురువుగారి ఆ చూపు, ఆ చిరునవ్వు ఇంకా నా కన్నులలో మెదులుతూ ఉన్నాయి. ఆ నవ్వును నేను ఎప్పటికీ మరచిపోలేను. ఇంత ఆనందాన్ని నాకు ప్రసాదించిన పూజ్య గురుదేవులకు మరొక్కసారి నమస్కారములు తెలుపుకుంటూ..

– **రాధిక,** సంతనూతలపాడు

# అంతటా నిండిన సాయి పాదం

సద్గురురాయా! మీ చరణాల చెంత మాకింత చోటిచ్చినందుకు మీకు ఎలా మా కృతజ్ఞతలు తెలుపుకోగలం– సాయికి నమస్సులర్పించడం తప్ప! సాయి తన గురువుపట్ల తనకున్న భావం చెప్పిన మాటలు మేము ఆలకించలేకపోయామన్న చింత కొంత తీరినట్లే కదా! ఈ మాటలు విని. "బాబానే మనందరికీ గురువు. .... బాబాను గట్టిగా పట్టుకోండి. నాలాంటి వాళ్లు వందలు, వేల మంది వస్తారు, వెళ్తారు, కానీ ఎప్పటికీ అలా కదలకుండా ఉండిపోయే దైవం బాబా. మీరు నా దగ్గరకు వచ్చినా పట్టుకునేది ఆయన్నే, నన్ను కాదు. నేను ఇట్టనే చెయ్యి ఇచ్చినట్లే ఇస్తా, కానీ ఇచ్చేది మాత్రం బాబా పాదాల్నే! అది మిమ్మల్ని (నాచెయ్యి ఇవ్వడం) మిమ్మల్ని ఏమార్చడానికే! మీరు పట్టుకునే సమయానికి అందేది మాత్రం బాబా పాదాలే! పట్టుకోవాల్సింది, నేను పట్టిచ్చేది బాబా పాదాలనే. సద్గురుపథమే అది". మాన్కర్‌కు మచ్చీంద్రగఢ్‌లో కన్పించి "ఈ మూడున్నర మూరల దేహానికి తాను పరిమితం కాదన్న" బాబా మాటల మననంలో, గురుదేవుల అవ్యాజమైన, అనన్యమైన సాయిప్రేమ మైకంలో సాగిన ఈ లీలా వినోదాన్ని మీరూ అవధరించండి.

పూజ్య గురుదేవుల పాదములకు నమస్కరిస్తూ... గురువుగారు మనపై చూపించే ప్రేమ, మనల్ని తీర్చిదిద్దే విధానము (మనకోరికలు తీర్చడం ద్వారా) నాకు జరిగిన అనుభవాన్ని గురుకృప ద్వారా అందరితో పంచుకుంటున్నాను. నా పేరు గాయత్రి అనిల్. మేము హైదరాబాద్‌లో ఉంటున్నాము. 2007వ సం॥ ఏప్రిల్‌లో హైదరాబాద్‌లో నామసప్తాహం జరిగింది. ఆ సమయంలో బాబా ఫొటోతోపాటు గురువుగారివి కూడా రెండు సజీవ ప్రమాణమంత ఫొటోలు పెట్టడం జరిగింది. సప్తాహం మొదటిరోజున నిలువెత్తు గురువుగారిని చూడగానే ఒక కోరిక కలిగింది. అదేమిటంటే సప్తాహం అయిన తరువాత గురువుగారిని మా ఇంటికి తీసుకెళ్దామని. వారం రోజులు నామంలో కూర్చున్నంతసేపు కూడా నేను గురువుగారిని మాఇంటికి రమ్మని (ఆ ఫొటో రూపంలో) నాకు చేతనయిన విధంగా మిమ్మల్ని పూజించుకుంటాను, నాకు వచ్చిన పదార్థాలన్నీ చేసి పెడతాను, మిమ్మల్ని బాగా చూసుకుంటాను, మా ఇంటికి రండి గురువుగారు అని అడుగుతూనే ఉన్నాను. ఆ ఫొటో మా ఇంట్లో ఉంటే మాకంటూ ఒక వ్యక్తి ఉన్నారు. ఆయన మా ఇంటి పెద్ద, మాతోడు అని నా భావన. అందుకోసం నేను గురువుగారిని అడుగుతూ ఉన్నాను. సప్తాహం ముగిసింది. కాని గురువుగారి ఫొటో కోసం మేము చేసిన ప్రయత్నం విఫలమైంది. అందులో ఒకటి ఎవరో గురుబంధువు, మరొకటి యూత్ సత్సంగానికి అని చెప్పారు. గురువుగారు మా ఇంటికి రాలేదు. సప్తాహం అయిన వారం తర్వాత ప్రతినెల రెండవ శనివారం నాడు జరిగే 12గం॥బాబా నామంలో పాల్గొన్నాను. సాయినామ సంకీర్తన శనివారం సాయంత్రం 6 గంటలకు మొదలై ఆదివారం ఉదయం 6 గంటలకు పూర్తవుతుంది. ఆదివారం ఉదయం నామం అయిపోయిన తరువాత సురేంద్ర అంకుల్, సత్సంగం శుభ్రం చేయడం కోసం కొంతమందిని ఉండమన్నారు. సరే అని నేను, అనిల్ కూడా ఉన్నాము. ముందురోజు సాయంత్రం బాబా నామం

జరుగుతున్నపుడు బాబా ఫోటోని ప్యాక్ చేసారు. ఆదివారం ఉదయం యూత్ సత్సంగానికి పంపించవలసినవి అన్నీ సర్ది ఒక ఓపెన్ ఆటో మాట్లాడుకొని ఆటోలో తీసుకువెళుతున్నారు (గురువుగారి ఫోటోతో సహా) గురువుగారి ఫోటోని ప్యాక్ చేయలేదు. గురువుగారి ఫోటోని ఆటోలో తీసుకెళ్తుంటే నాకు ఎందుకో గురువుగారికి నేను దూరమైపోతున్నాను అన్న బాధ, ఆ వారంరోజులు నేను గురువుగారిని మా ఇంటికి రమ్మని ఎంతగా అడిగినా రాలేదన్న బాధతో గురువుగారి ఫోటో గేటు దాటి వెళ్లిపోయేంతవరకు అలా చూస్తూ ఉండిపోయాను వస్తున్న కన్నీళ్లను ఆపుకుంటూ. ఆటో గేటు దాటి వెళ్లిపోయింది. అప్పుడు నన్ను నేను గమనించుకుంటే చాలా ఆశ్చర్యం. ఆటో గేటు దాటగానే నా మనసులోని బాధ అంతా బయటకు పోయింది. నేను పనిలో పడిపోయాను. ఒంగోలు సప్తాహానికి అన్నీ సర్ది, సత్సంగ మందిరం అంతా శుభ్రం చేస్తున్న సమయంలో సరోజినీ ఆంటీ నాకు ఒక చిన్న బాబా విగ్రహాన్ని ఇచ్చారు. నేను అనాలోచితంగానే బాబాను తీసుకున్నాను. అంతా శుభ్రం చేసి బయలుదేరుతూ బాబాని చేతిలో పట్టుకొని బైక్ ఎక్కబోతుండగా గురుబంధువు రామకృష్ణ నా దగ్గరకు వచ్చి ఈ బాబాను నువ్వు తీసుకువెళుతున్నావా అని అడిగారు. అవును నాకు సరోజినీ ఆంటీ ఇచ్చారు. ఎవరో ఇక్కడ తెచ్చిపెట్టారట కదా! దుమ్ము చేరుతుంది, తీసుకెళ్లమని నాకు ఇచ్చారు అని చెప్పాను. కాని అసలు విషయం అపుడు తెలిసింది. హైదరాబాదులో సప్తాహం జరిగినపుడు శనివారంనాడు బాబా, గురూజీ చిత్ర పటాలను పల్లకీలో ఉంచి నామం చేసుకుంటూ నగరోత్సవం చేసుకున్నాము. ఆ ఉత్సవం జరుగుతున్న సమయంలో ఎవరో ఒక వ్యక్తి ఒక బాబా విగ్రహాన్ని తెచ్చి పల్లకీలో ఉంచమన్నారట. మనవాళ్లు పల్లకీలో బాబాను ఉంచి తిరిగి ఇవ్వబోతుండగా ఆయన 'వద్దు, బాబాని అక్కడే ఉంచండి' అని అన్నారట. మనవాళ్లు ఇక్కడ బాబా నామ సప్తాహం జరుగుతుంది. ఒకవేళ మీ బాబా విగ్రహం మిస్ కావచ్చు అని చెప్పగా, ఆయన ఫరవాలేదు ఆ బాబా విగ్రహం ఎవరికి చేరాలో వారికే చేరుతుందిలే. ఎవరూ తీసుకోకపోతే అప్పుడు నేను తీసుకువెళ్తాను అని చెప్పారట. ఆయన మన గురుబంధువు కాదు. ఆయన ఎవరో మనవాళ్లకు తెలియదట. అలా ఆయన తెచ్చి పెట్టిన బాబావిగ్రహాన్ని ఆంటీ నాకు ఇచ్చారు. ఆ మాటలతో కాని అర్థం కాలేదు. నా గురువు నా కోసం చేసిన ఏర్పాటు. నేను గురువుగారిని ఇంటికి రమ్మని అడుగుతుండగా నా కోసం గురువుగారు ఆయన సర్వం అయిన "బాబానే" నాకు ఇచ్చారు. "నన్ను ఆనంద స్వరూపంగా ధ్యానించు" అన్నారు బాబా. ఆయన రూపాన్ని ఆనందంగా ఎలా ధ్యానించాలో నాకు తెలియదు కాని నాకు గురువుగారు ఇచ్చిన బాబాను చూస్తున్నపుడు ఏదో ఆనందం, ఆ వెనుక నా గురురూపం, నా గురువు నా కోరికలు తీరుస్తూ నన్ను తీర్చిదిద్దే విధానం... నాకు, నా గురువుకి ఎలాంటి బంధం ఉన్నదో తెలియదు కాని, ఈ బంధం, ఈ ప్రేమ జన్మజన్మలకు కొనసాగాలని ఆయన బిడ్డగా బ్రతకాలని బాబా పాదాలు పట్టుకొని అర్థిస్తూ...

– గాయిత్రి అనిల్, హైదరాబాద్

## సాయి చూపిన ప్రగతి పథము

శ్రీమతి కాశీబాయిది నిరుపేద కుటుంబం. రెక్కాడితేగాని డొక్కాడదు. ఆమె రోజంతా పొలంలో పనిచేస్తే గానీ కడుపు నిండేది కాదు. కానీ, ఆమెకున్న చిన్నారితో అలా పనికి వెళ్లడానికి కుదరదు. అందుకు రోజూ ఆ బిడ్డను సాయి చెంత వదిలి తన పనికి తాను వెళ్లేది. ఎన్ని రోజులు గడిచినా ఆమెకు ఏనాడూ ఇబ్బంది రాలేదు. పేరుకు మాత్రమే ఆమె అతడికి తల్లిగాని, నిజానికి ఆ బిడ్డకు తల్లి,తండ్రి, తోడు, నీడ సాయిబాబాయే! బిడ్డల ప్రగతి తప్ప తనకు వేరేది ముఖ్యం కాదు. అందుకే సద్గురువే అన్నింటికీ ఆధారమని శృతి, స్మృతులవాణి. 'సాయి' అంటేనే మనలను పరిపూర్ణులను చేయటానికై సాగే ఒక గొప్ప జీవన విధానం. ఇది సాయిపథం, అంటే **ప్రగతికి నాంది – భక్తి తత్త్వానికి పునాది** సాగిపోయే జీవనది.

నా పేరు జానకి. నాకు చదువంటే చాలా ఇష్టం. అలాంటిది మా ఇంట్లో ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగానే ఉండడం వలన పదవ తరగతితోనే చదువు ఆపవలసి వచ్చింది. నేను, మా చెల్లెలు ఇద్దరమూ 10వ తరగతి ప్రథమశ్రేణిలో 75శాతం కంటే ఎక్కువ మార్కులతో పాసయ్యాం. కాని ఇద్దరమూ చదువును కొనసాగించలేకపోయాము. బాబా దయవల్ల నేను మందుల షాపులో ఒక ఉద్యోగంలో చేరాను. మా యజమానిగారే నాకు కరస్పాండెన్స్‌గా డిగ్రీ చదవమని సలహా ఇవ్వడం, నేను డిగ్రీలో చేరడం జరిగాయి. డిగ్రీ మొదటి సంవత్సరం పరీక్షలప్పుడు నాకు బాగా జ్వరం వచ్చింది. లేవలేనంతగా ఉన్నాను. ఇక రెండు రోజుల్లోనే పరీక్షలు. నేను పరీక్షల్లో ఫెయిల్ అవుతానేమోనని అనుకున్నాను. ప్లీజ్ బాబా! ఎలాగైనా నేను పరీక్షల్లో పాస్ అవ్వాలి. నాకు ఆశీస్సులు ఇవ్వండి అని బాబాను వేడుకున్నాను. సెలైన్ బాటిల్స్ పెట్టించుకొని బాబా ఆశీస్సులతో పరీక్షలు వ్రాసాను. పాసయ్యాను. ఇదంతా బాబా అనుగ్రహం వలనే జరిగింది. నేను ఉద్యోగం చేస్తూ డిగ్రీ పూర్తి చేసాను. ఇపుడు చాలా సంతోషంగా ఉన్నాను. నాన్నగారికి సహాయపడేలా, నా చదువును కొనసాగించేలా నా కోరికను తీర్చిన బాబాకు ఎల్లప్పుడూ నేను విధేయురాలను. మామీద ఇంత ప్రేమను చూపిస్తున్న బాబా, గురూజీలకు ప్రణామాలర్పిస్తూ..

**– కె. జానకి, విజయవాడ.**

## నీవే మము కాపాడు ఏలిక - లేదు నీ కరుణకు పోలిక

కొలిమిన పడబోయిన బిడ్డను కాపాడటానికి అమాంతము తన చేయిని కొలిమిలో ఉంచి బిడ్డను కాపాడెను నాడు సాయి. తన సంకల్పమున కూడా బిడ్డల కష్టమును ఓర్వలేని ఆ మాతృత్వం సద్గురు తత్త్వానికి చుక్కాని అన్నది నిర్వివాదాంశం. అసలు **సద్గురు తత్త్వమంటేనే చక్కని మాతృత్వం.** ద్వారమందు ఎదురుచూసే ఆ తల్లి (ద్వారకామాయి) ప్రేమ ఈ సకల సృష్టి యొక్క స్థితినే మార్చగలదంటే అతిశయోక్తి కాదు. భౌతికంగా తానెక్కడున్నా, అనుక్షణము వెన్నంటి ఉండి, వెతలకు తావు లేకుండా మనలను తన వారిగా స్వీకరించిన ఆ సద్గురు చరణ కమలాలకు పాదాభివందనం చేస్తూ...

పూజ్య గురుదేవుల పాద పద్మములకు నమస్కరించుకుంటూ మాపై గురుదేవులకు ఉన్న ప్రేమ, రక్షణను అనుభవ రూపంలో పంచుకుంటూ – నా పేరు పద్మ. మాది తెనాలి. ఒంగోలు సాయిబాబాజీ నగర్‌లో బాబా మందిర నిర్మాణం జరుగుతున్న విషయం అందరికీ తెలిసినదే. “ఆలయ నిర్మాణం చేపట్టే ముందు, ఆలయం నిర్మించబోయే ప్రదేశంలో మహాత్ముల చరిత్రల పఠనము, పవిత్ర ఆధ్యాత్మిక ధార్మిక గ్రంథాల అధ్యయనము, మహాత్ముల ఆశీస్సులు, సామూహిక జపధ్యానాలు కొంతకాలంపాటు జరగాలి” అన్న గురుదేవుల వచనానుసారంగా ఈ మందిర నిర్మాణం జరుగుతున్న సమయంలో ప్రతీ ఆదివారం ఒక్కొక్క ఊరువాళ్లు బాబా నామం చేసుకోవడం, అందరూ అందులో పాల్గొనడం జరుగుతోంది. ఈ క్రమంలో ఏప్రిల్ 23 వ తేదీ 2006న తెనాలి వారికి ఆ అవకాశం రావడంతో మేమంతా ఒంగోలు వెళ్లి ఆ రోజంతా సాయిఊసులో, సాయిధ్యాసలో ఆనందంగా గడిపి సాయంత్రం బాబా, గురువుగారి దగ్గర శెలవు, ఆశీస్సులు తీసుకొని, తిరిగి తెనాలికి బయలుదేరాము. మేము రైల్వే స్టేషన్‌కి వెళ్లేసరికి రైలు బయలుదేరడానికి సిద్ధంగా ఉన్నది. మాకు అందరికీ టికెట్స్ తీసుకొనలేకపోయాము. హ్యాండిక్యాప్ టికెట్ కనుక అందరూ అయిపోయిన తరువాత ఇస్తామన్నారు. సరే అని ఉన్న టికెట్స్‌తో అక్క, పిల్లలు, జయని మీరు వెళ్లండి, అమ్మ, నేను తరువాత రైలుకి వస్తాము అని చెప్పి పంపించాను. మేము టికెట్స్ తీసుకునే సమయానికి మాకు కూడా రైలు సిద్ధంగా ఉండడంతో ఫ్లాట్‌ఫారం మీదకు వెళ్లాము. మేము వెళ్లేసరికి రైలు కదులుతుంది. నేను అమ్మని రైలు ఎక్కిస్తుండగా అమ్మ మొదటి మెట్టు మీద కాలువేయగానే రైలు వేగం పుంజుకోవడంతో రెండవ కాలు మెట్టుమీద వేయలేక రైలుకి, ఫ్లాట్‌ఫారంకి మధ్యలోకి పడిపోయింది. రైలు వేగం ఇంకా పెరగడంతో అమ్మ మోకాళ్ల వరకు వెళ్లిపోయింది. నేను అమ్మని గట్టిగా పట్టుకుని బాబా, సాయిబాబా అని పెద్దగా అరిచాను. అంతలో ఒక పోలీసు వచ్చి అమ్మని బలంగా బయటకు లాగారు. దాంతో అమ్మ, నేను ఫ్లాట్ ఫారం మీదకు చాలా దూరంగా పడ్డాము. పోలీసు అమ్మని బయటకు లాగడం, రైలు చైను లాగడం ఒకేసారి జరిగాయి. మేము టికెట్స్ కోసం క్యూలో ఉన్నపుడు సెక్యూరిటీగా ఉన్న ఆ పోలీసునే అడిగి మేము రైలు సమాచారం తెలుసుకున్నాము. ఆయనే వచ్చి మా అమ్మని కాపాడారు. మా అమ్మకి కాలు గీసుకోవడంకాని, దెబ్బలు కాని ఏమీ తగల్లేదు. మరలా ఆ పోలీసే మమ్మల్ని జాగ్రత్తగా రైలు ఎక్కించారు. ఇలా గురుదేవులు అనుక్షణం మమ్మల్ని కాపాడుతునే ఉన్నారు. ఈరోజు ‘సాయిబాబా’ అని నామం చెప్పగలుగుతున్నామంటే అది గురుదేవుల అనుగ్రహమే!...

**– పద్మ, తెనాలి.**

## చూపుదాపుల హేల... నీ దివ్య లీల!

తన చూపుకందని దాపు ఈ జగతిన ఎక్కడుంది? ఎక్కడ చూసినా కన్పించేది ఆ రూపే! ఆ రూపుకు ఏ పిలుపు కూడా అవసరం లేదు. బిడ్డకై పరితపిస్తూ సద్గురువు చేసే ప్రతీ పని మనకు లీల... ‘అమ్మ’గా మనకు ఆయన పాడే ‘జోల’! హరిశ్చంద్ర గుట్ట ఎక్కడానికి ఉద్యుక్తుడై శ్రమించి కొంతదూరం సాగాక మంచినీళ్లందక ఖిన్నుడవుతాడు నానా. ఇంతలో సాయి అంటారు మశీదులో “నానాకు బాగా దాహంగా అన్పించింది, మనం

అతనికి సరిపడా నీళ్లివ్వాలి!" అని. బిడ్డ దాహానికి అక్కడ సాయి చలిస్తే, ఇక్కడా అలాంటిదే విద్యా దాహార్తి కల **బిడ్డకై తండ్రి ఏర్పాట్లు, ఇక చింతలే లేవు ఏ అగచాట్లు!** అనుగ్రహ వర్షం... ఇక తడవండి.. తడిసి ముద్దవ్వండి.

నా పేరు రామ్‌కుమార్, మాది తెనాలి. నేను బి.టెక్. చివరి సంవత్సరం చదువుతున్నపుడు నాకు జరిగిన అనుభవం ఇది. మాకు బి.టెక్. మూడవ సంవత్సరంలో మైక్రోప్రాసెసర్ అనే సబ్జెక్ట్ ఉన్నది. అది చాలా కష్టం. అందులో నేను ఉత్తీర్ణుడు కాని కారణాన మరలా సప్లిమెంటరీకి దరఖాస్తు చేసాను. పరీక్షలు మొదలైనవి. అదే నాకు చివరి అవకాశం.ఎలాగైనా పరీక్ష పాస్ కావాలని చాలా కష్టపడి చదివాను. పరీక్ష ఉదయం 10.15ని॥లకు అయితే నేను 7.30ని॥లకు కాలేజీకి వెళ్లిపోయి ఒక ఖాళీ బస్సులో కూర్చొని చదివినవి అన్నీ మరలా చూసుకుంటున్నాను. టైమ్ 10 గం॥ అవడంతో పుస్తకాలు అన్నీ బ్యాగ్‌లో పెట్టుకొని, పెన్ , హాల్ టికెట్ జేబులో పెట్టుకొని, స్కేలు, పెన్సిల్ కోసం వెతుకుతున్నాను. అప్పుడు కాని గుర్తుకురాలేదు. స్కేలు, పెన్సిల్ ఇంట్లో టేబుల్ మీద పెట్టి తీసుకురావడం మరచిపోయిన విషయం. ఎవరినన్నా అడుగుదామా అంటే కనుచూపుమేరలో మనిషనేవాడే లేడు. నాకు టెన్షన్ మొదలయింది. పరీక్ష సమయం కావడంతో నాకు ఏమి చేయాలో తోచక బాబా, గురూజీలకు నమస్కారం చేసుకొని బస్ దిగి బ్యాగ్ తీసుకొని బయలుదేరాను. ఇంతలో క్యాంపస్‌లో ఒక ఖాళీ బస్ కనిపిస్తే అందులో నా బ్యాగ్ పెడదామని బస్ ఎక్కాను. అలా ఎక్కగానే బస్‌లో ఒక సీటులో స్కేలు, పెన్సిల్ ఉన్నవి. అవి తీసుకొని ఆ బస్ డ్రైవర్ దగ్గరకు వెళ్లి ఇవి నీ బస్సులో వున్నాయి, ఎవరైనా మరచిపోయారా అని అడిగాను. అపుడు ఆ బస్సు డ్రైవరు ఆ బస్సుని రెండు రోజులుగా వాడడం లేదని చెప్పాడు. ఆ మాట వినగానే షాక్ అయ్యాను. నేను బాబా, గురువుగారిని అడిగి నిమిషాలు కూడా కాలేదు. వెంటనే నాకు అడిగినవి ఇచ్చారు. నాకు చాలా ఆనందం కలిగింది. నేను ఆ స్కేలు, పెన్సిల్ తీసుకొని పరీక్ష హాలులోకి అడుగు పెట్టబోతుండగా మా స్నేహితుడు నన్ను పిలిచి మూడు ప్రశ్నలు చూపించి అవి ఒకసారి చదువుకొని వెళ్లమన్నాడు. అవి చాలా క్రొత్త ప్రశ్నలు. పైగా నేనెపుడూ చూడలేదు కూడా. నేను చూడను టైమ్ అయ్యింది అని వెళుతుండగా వాడు గొడవచేసి ఇంకా పదినిమిషాలు టైమ్ ఉంది త్వరగా చూసుకొని వెళ్లమన్నాడు. సరే అని ఆ మూడు ప్రశ్నలు చదువుకొని పరీక్ష హాలులోకి వెళ్లి ప్రశ్నాపత్రం చూడగానే 1,2,3 ప్రశ్నలు ఆ మూడే ఉన్నాయి. నాకు కళ్లలోంచి నీళ్లు వచ్చాయి. ఆ రోజు బాబా, గురువుగారు నాతోనే ఉన్నారనిపించింది. నిజంగా ఆరోజు నాకు స్కేలు, పెన్సిల్ దొరకకపోయినా, ఆ మూడు ప్రశ్నలు చదవకపోయినా, నేను ఆ పరీక్ష పాస్ అయ్యేవాడిని కాదు. ఎందుకంటే ఆ మూడు ప్రశ్నలు తప్ప నాకు వచ్చిన ప్రశ్నలు ఏవీ ఆ ప్రశ్నాపత్రంలో లేవు. ఆ రోజు పరీక్ష బాగా వ్రాసాను. పాసయ్యాను. ఇలాగే బాబా, గురువుగారి ఆశీస్సులు నాకు ఎల్లప్పుడూ ఉండాలని, ఇలాంటి మధురానుభవాలు మీతో పంచుకోవాలని కోరుకుంటూ..

**యస్. రామ్ కుమార్, తెనాలి.**



## ఏది శిరిడీ - ఏది నీ ఒడి

నవమాసాలు తల్లి తనువులో భాగంగా గడిపిన శిశువుకు, వాతావరణంలోకి రాగానే భయంగా ఉంటుంది. కానీ తల్లి ఒడిలో చేరగానే ఇక ఈ ప్రపంచం నన్ను ఏం చేయగలదని సంబరపడిపోతుంది, తల్లి ఒడిలోని మాధుర్యమది. సద్గురువనే అమ్మఒడిని విడిచి పోగలమా మనం, సప్త సముద్రాల ఆవలనున్నా నా బిడ్డల రక్షణ నేను వహిస్తానన్న సద్గురు అభయం మనకు కొండంత అండ. అలా ఈనాడు గురుదేవుల దక్షిణను, ప్రేమను చవిచూసిన వ్యక్తికి అది ఆంధ్రదేశమైనా, అమెరికా సంయుక్త రాష్ట్రాలైనా, అమ్మఒడిన చేరాలనే ఆ పరితాపం తీరేది కాదు. అయితే కార్యార్థులై వెడలిన ప్రవాస గురుబంధువులకు లభించేది తక్కువ సమయం, ఎక్కువ ఆర్తి, ఎలా అన్ని కోరికలు తీరేది! ఏ విధంగా సద్గురుదేవుని తనివితీరా దర్శించి, భాషించేది. వారి నివాసం ప్రవాసం, కానీ హృదయంలోనే సద్గురుమూర్తి ఆవాసం. ఇక సందేహమేముంది.... చివరకు వారి వదనాల్లో చిరుమందహాసం.

నా పేరు రాజ్యలక్ష్మి. మేము న్యూజెర్సీలో ఉంటాము. నాకు 2005 విజయదశమికి ఇండియా వెళ్ళి, బాబా, గురువుగారిని దర్శించుకునే అవకాశం కలిగింది. అప్పుడు గురువుగారు నాకు ప్రసాదించిన మధురానుభూతులను పంచుకునే ప్రయత్నం. ఇండియాకు మొదట నేను వెళ్లాలనుకోలేదు. అనుకోకుండా వెళదామనిపించి, అక్టోబర్ 3 నుండి 29 వరకు ఇండియాలో ఉండటానికి అన్ని ఏర్పాట్లు చేసుకున్నాము. నేను ఇండియా రావడానికి రెండు కారణాలు ఉన్నాయి. గురువుగారిని దర్శించుకోవడం కోసం, మానాన్నగారికి ఆరోగ్యం సరిగా లేనందున ఆయనను చూడడం కోసం. మేము ఎప్పుడు ఇండియా వెళ్లినా హైదరాబాదుకి టిక్కెట్లు తీసుకొని వెళతాము. కాని ఈసారి టిక్కెట్స్ తీసుకున్నపుడు చెన్నై అయితే బాగుంటుంది, గురువుగారి దర్శనం చేసుకొని వెళ్లవచ్చు అనుకున్నాను. కానీ, ఈ విషయం ఎవ్వరికీ చెప్పలేదు. మావారు ఆఫీసు నుండి ఫోన్ చేసి చెన్నైకి టికెట్లు ఉన్నాయి అని చెప్పారు. దాంతో నేను గట్టిగా నిర్ణయించుకున్నాను. గురువుగారి దర్శనం చేసుకునే ఇంటికి వెళ్లాలని.

అంతకు ముందు జూలైలో మా నాన్నగారికి గుండెనొప్పి వచ్చి ఆసుపత్రిలో ఉన్నారు. నాలుగు రోజులు అబ్జర్వేషన్‌లో ఉంచాలని చెప్పారు. అప్పుడు నేను అలా గురువుగారిని చూస్తూ “ఎలా అయినా సరే నాన్నకి ఈరోజే నొప్పి తగ్గి, ఇంటికి వెళ్లిపోయేలా మీరే చూడాలి” అని అడిగాను. నేను ఎప్పుడు ఇండియా వస్తే అప్పుడు నాతోపాటు నాన్నని కూడా మీ దర్శనానికి తీసుకువస్తాను అని చెప్పాను. కాని మేము ఇండియాకు వస్తున్నపుడు అందరూ మా నాన్నని చెన్నై వద్దు, చాలా నీరసంగా ఉన్నారని అని అంటున్నా కూడా మా నాన్నగారిని గురువుగారి దర్శనానికి వచ్చారు. అంతేకాక మా బంధువులలో ఎవరికైతే అవసరముందో వారినందరినీ కూడా గురువుగారు రప్పించారు.

చెన్నై నుండి తిరువణ్ణామలై వెళ్లే దారిలో మేము ప్రయాణిస్తున్న వాహనానికి యాక్సిడెంట్ అయ్యింది. మా వాహనం ఒక మహిళను గుద్దింది. ఆ పరిస్థితిలో ఆమె ఇంకా బ్రతికే ఉంటుందని అనుకోలేదు. వాహనంలో ఉన్న మాకు ఎవ్వరికీ ఏమీ కాలేదు. కాని ఆమె ముఖం ఒక ప్రక్క శరీరం అంతా లేచింది. కాని ఆమె ప్రాణానికి భయం ఏమీ లేదు అని చెప్పారు. మేము గురువుగారి దర్శనానికి వెళదామనుకున్నపుడు "గురువుగారు ఏ నిమిషంలో అయినా శిరిడీకి బయలుదేరవచ్చు" అని మన గురుబంధువులు చెప్పారు. మేము చాలా ఆలస్యంగా బయలుదేరడం వలన గురువు గారి దర్శనం కోల్పోతామేమోనని భయం వేసింది. సాయంత్రం 5 గంIIలకు తిరువణ్ణామలై చేరాము. వెంటనే నరేంద్రగారు కనిపించడంతో ఆయనతో మాట్లాడగా గురువుగారు ఉన్నారు, దర్శనం ఉంటుంది మీరు రెడీ అయి రండి అని చెప్పాకగానీ మా మనసులోని ఆందోళన తగ్గలేదు. గురువుగారి దర్శనానికి వెళ్లాము. అలా గురువుగారు మనకోసం వచ్చి అన్నీ విని మనల్ని ఆశీర్వదించి వెళుతున్నట్లు అనిపించింది. గురువుగారి దర్శనాన్ని నేను చాలా ఆనందించాను. అలా గురువుగారు మా నాన్నగారికి, నాకు కూడా దర్శన భాగ్యాన్ని ప్రసాదించి నా కోరిక తీర్చారు. తరువాత విజయదశమికి నేను శిరిడీ వెళ్లాను. విజయదశమి రోజున గురువుగారి చేతులమీదుగా కొన్ని వివాహాలు జరిగాయి. చాలా ఆనందంగా గురువుగారి దర్శనం చేసుకొని తదనంతరం జరిగే పల్లకీ ఉత్సవంలో పాల్గొన్నాను. పల్లకీ ఉత్సవం పూర్తి అయి, మేము సాయిపథం దగ్గరకు రాగానే మా నాన్నగారికి మరలా గుండెనొప్పి వచ్చి, రెండురోజులు ఆసుపత్రిలో ఉన్నారని, వెంటనే బయలుదేరి రమ్మని ఫోన్ వచ్చింది. కానీ, అప్పటికే సాయంత్రం 7 గంIIలు అవడంతో ఇక బయలుదేరలేకపోయాము. మా పాప జాహ్నవిది కూడా విజయదశమి రోజే పుట్టినరోజు. అందువలన ఆ రోజున వివాహాలు, అన్నప్రాసన, అక్షరాభ్యాసాలతోపాటు మాకు కూడా పాద నమస్కారం చేసుకోవడానికి అవకాశం ఉంటుందని ఆశపడ్డాము. కానీ, ఉదయం దర్శన సమయంలో వివాహాలు మాత్రమే జరిగాయి. నేను ఇండియాలో ఉన్నపుడు ఎప్పుడూ పుట్టినరోజునాడు గురువుగారి పాద నమస్కారం మిస్ కాలేదు. సాయంత్రమైనా గురువుగారి పాద నమస్కారం లభిస్తుందేమోనని గ్రిల్ దగ్గర నిలబడితే విపరీతమైన జనంతో అప్పుడు కూడా అవకాశం దొరకలేదు. ఆ పరిస్థితిలో ఎలా ఉందంటే బాధ లేదు, అలానే సంతోషంగా కూడా లేను. నేను శిరిడీ వచ్చాక అప్పటికి ఇంకా బాబా దర్శనానికి వెళ్లలేదు. గురువుగారి దర్శనం చేసుకొని విజయదశమి రోజున రాత్రంతా మందిరం తెరచి ఉంటుంది కనుక రాత్రి 11గంIIల తరువాత బాబా దర్శనానికి వెళ్లాము. బాబా దయ వలన ఒక గంట లోపే మూడుసార్లు బాబా దర్శనం చేసుకున్నాము. నేను సమాధి మందిరంలోకి వెళ్లగానే నాకు కలిగిన అనుభూతి, బాబా ఒక పెద్దాయనలాగ, నా కోసం ఎదురు చూస్తున్నట్లు, అలా కూర్చున్నట్లు అనిపించింది. బాబా తమ దర్శనానికి ఆలస్యంగా వచ్చినా చాలా ఆనందానుభూతిని కలిగించారు. ఊదీ క్యూ తక్కువగా ఉండడంతో చాలా ఊదీ సేకరించాము. అలా బాబా స్మరణలో గడిపాము.

శిరిడీ నుండి వస్తూనే మా నాన్నగారు ఉన్న ఆసుపత్రికి వెళ్లాము. ఆయనకు రెండు రోజులుగా చాలా ఎక్కువగా గుండెనొప్పి వస్తుంది. ఐదు రోజులకు కొద్దిగా తగ్గి, వారం రోజుల తరువాత ఇంటికి తీసుకువెళ్లడం జరిగింది. నేను ఇండియాకు వచ్చిన రెండు కారణాలలో గురువుగారిని చూడాలనే కోరిక తీరింది. మా నాన్నగారికి తగ్గిపోవాలని బాబా, గురువుగారిని శిరిడీలో అడిగి వచ్చాను. మేము 3 రోజుల తరువాత నాన్నగారిని విజయవాడ హార్ట్ స్పెషలిస్ట్ దగ్గరకు తీసుకొని వెళ్దామని నిర్ణయించుకొనగా ఆ హాస్పిటల్ డాక్టర్ ఒకరు ప్రతి మంగళవారం తెనాలి వచ్చి చూస్తారని తెలిసింది. ఆయనతో మాట్లాడగా మా నాన్నగారిని చూసి బెలూన్ సర్జరీ చేయాలి. రేపు విజయవాడ వస్తే చేస్తాను అని చెప్పారు. మామూలుగా ఆ ఆసుపత్రిలో చేరాలంటే వారం ముందుగా ఫోన్ చేయాలి. కానీ బాబా మన పనులను మన చుట్టూ ఉండే వ్యక్తుల ద్వారా సరి అయిన సమయంలో చేస్తారు అనే దానికి నిదర్శనంగా – మా నాన్నగారి కజిన్ డాక్టర్, ఆయన స్నేహితుడు ఆ హాస్పటల్‌లో పని చేస్తున్నాడు. ఆయన ద్వారా ఏకంగా చీఫ్‌తోనే మాట్లాడగా, ఆయనే మా నాన్నగారిని పరీక్ష చేసి, ఇంతకు ముందు తీసిన ఏంజియో సిడిని ఒకసారి చూడాలి. అది చూసి ఏం చేయాలో నిర్ణయిద్దాం అన్నారు. హాస్పిటల్‌లో చేర్పించండి అన్నారు. డాక్టర్ మా నాన్నగారి ఏంజియో సిడిని చూసి మూడు వాల్వులు కొంచెం బ్లాక్ అయ్యి ఉన్నాయి. మరలా ఏంజియోతీసి సర్జరీ అవసరమా? లేదా? నిర్ణయిద్దాం అన్నారు. చివరకు రేపు ఉ॥ 7.30 ని॥లకు ఏంజియో, వెంటనే సర్జరీ కూడా చేద్దామన్నారు. డ్యూటీ డాక్టర్స్ ముందు రోజు అలా బి.పి., షుగర్ అన్నీ సరిగా ఉండేలా చేస్తున్నారు. చీఫ్ డాక్టర్ రాత్రి 10 గం॥లకు వచ్చి, రూమ్ బాగాలేదు మార్చమని చెప్పడంతో రూమ్ మారి రాత్రి 11గం॥లకు పడుకున్నాము. అప్పుడు మా నాన్నగారు ఒక్కసారిగా లేచి, బాగా నొప్పిగా ఉంది అన్నారు. వెంటనే ఐ.సి.యు.లోకి మార్చారు. అప్పుడు హార్ట్‌బీట్ 240 వరకు వెళ్లింది. మామూలుగా అయితే 72 ఉండాలి. మా నాన్నగారు నిద్రపోవడానికి ఇంజక్షన్స్ ఇచ్చారు. అయినా నిద్రపోలేదు. అలా కళ్లు మూసుకుని ఉండి నన్ను రూమ్‌కి వెళ్లి పడుకోమన్నారు. నా బ్యాగ్‌లో ఉన్న తెల్లకాగితం మీద బాబా నామం వ్రాసుకుంటూ బాబాను ప్రార్థించాను. మా నాన్నగారు 5 గం॥లకు నిద్రపోయారు. 6 గం॥లకు మరలా 104 డిగ్రీల జ్వరం వచ్చింది. మరలా ఆందోళన. డాక్టర్ వచ్చి జ్వరం తగ్గితేనే సర్జరీ చేస్తాము అని చెప్పారు. చివరకు 9.30కి జ్వరం తగ్గింది. 9.40కి ఆపరేషన్ థియేటర్‌కి తీసుకొని వెళ్లారు. అక్కడ థియేటర్ అటెండెంట్ బాబా, గురువుగారి ఫోటో ఇచ్చి, మా నాన్నగారి తలక్రింద పెట్టండి అని అడగగా, ఎందుకండి చేతిలోనే పెడతాను అన్నాడు. చాలా సంతోషంగా అనిపించింది.

మేము ఆపరేషన్ థియేటర్ ప్రక్కనే ఉన్న ఒక రూమ్‌లో కూర్చొని ఏంజియో తీయడం చూస్తున్నాము. 12 ని॥ల తరువాత డాక్టర్ బయటకు రావడంతో నాకు చాలా టెన్షన్‌గా ఉంది. ఏమి చెప్తారో అని. వెంటనే ఆయన చెప్పినది. సర్జరీ అవసరం లేదు. బ్లాకేజ్ కొంచెమే ఉంది. మందులతో కరిగిపోవచ్చు. అంతకు ముందు కంటే ఇప్పుడు కొంచెం బ్లాకేజ్ తగ్గింది. అన్నీ పాజిటివ్‌గా చెప్పారు. ఆ క్షణంలో నాకు వచ్చిన

ఆనందం ఇంతని చెప్పలేను. వెంటనే గురువుగారికి కృతజ్ఞతలు గురుబంధువుల ద్వారా తెలియచేసాను. మా నాన్నగారు బాగా దిగులు పడినా, ఈ విషయాన్ని డాక్టర్ ద్వారా విని చాలా సంతోషపడ్డారు. మా నాన్నగారు మనస్ఫూర్తిగా ఆనందంగా నవ్వడం నేను ఇండియాకు వెళ్లాక అప్పుడే చూసాను. నాకు చాలా ప్రశాంతంగా అనిపించింది. నేను ఇండియాకు వచ్చిన పనిని గురువుగారు సంతోషదాయకంగా పూర్తిచేసారు. తరువాత నాకు మిగిలిన కోరిక గురువుగారి పాద నమస్కారం చేసుకోవాలని. శిరిడీలో మిస్ అయ్యాము. ఎలాగైనా తిరువణ్ణామలై వెళ్లి, గురువుగారి దర్శనం చేసుకోవాలి. కానీ నా టికెట్ వారం రోజులు మాత్రమే ఉంది. నా వీసా నవంబర్ 15కి గడువు పూర్తవుతుంది. ఆలోపే నేను అమెరికా వెళ్లాలి. గురువుగారి దర్శనం చేసుకున్నాకే అమెరికా వెళ్దామని టిక్కెట్ నవంబర్ 9కి తీసుకున్నాను. తిరువణ్ణామలై వెళ్లడానికి మేము ముగ్గురం ఆడవాళ్లమే బయలుదేరాము. అప్పుడు మద్రాసుకి ఒక ట్రైన్ ఉంది. అది కూడా ఆలస్యంగా నడుస్తుంది. గురువుగారి దర్శనానికి వెళుతున్నాం. అన్నీ ఆయనే ఏర్పాటు చేస్తారు అనుకొని బయలుదేరాము. గురువుగారి అనుగ్రహంతో మాకు రిజర్వేషన్ దొరికింది. అనుకున్న టైమ్‌కి అనగా సాయంత్రం 6.50కి తిరువణ్ణామలై చేరుకున్నాము. అప్పుడే బాబాకు ఆరతి ఇచ్చి అందరూ గురువుగారి దర్శనానికి పైకి వెళుతున్నారు. మేము సరియైన టైమ్ కి చేరడం అంతా గురువుగారి లీల మాత్రమే. గురువుగారి దర్శనానికి మొదటి వరుసలో ఖాళీ ఉంటే అక్కడ నేను, జాహ్నవి కూర్చున్నాము. మాపై గురువుగారి దృష్టి పడడం మంచి అనుభూతిని కలిగించింది. ఆరోజు గురువుగారు తిరిగి వెళ్లేటప్పుడు పాద నమస్కారం చేసుకోలేకపోయాము. ఆ తరువాత రోజు నేను జాహ్నవికి ఒక సచ్చరిత్ర ఇచ్చి గురువుగారిచేత తాకించుకొని, నమస్కారం చేసుకొమ్మని చెప్పాను. గురువుగారు వెళ్లేటప్పుడు ఒక ప్రక్కగా నిలుచున్నాము. గురువుగారు జాహ్నవి చేతిలోని సచ్చరిత్రను తాకి తనవైపు ఒక్క నిమిషం అలా చూసారు. గురువుగారి ఆ చూపు చాలు ఇక ఈ ప్రపంచంలో ఏమీ అక్కర్లేదు అనిపించేంత ఆనందం కలిగింది. అప్పుడు మేము ఇద్దరం గురువుగారికి పాద నమస్కారము చేసుకున్నాము. అంతే కాకుండా ఆయన అనుగ్రహంతో అదేరోజు రాత్రి సుమారు 11.15 ని॥లకు గురువుగారిని పర్సనల్‌గా దర్శనం చేసుకునే భాగ్యం కలిగింది. నేను ఏమీ చేయకపోయినా, నాకు ఎటువంటి అర్హత లేకపోయినా, గురువుగారు నన్ను అనుగ్రహించిన తీరు వర్ణించలేను. అలా గురూజీ మాకు అంతులేని ఆనందాన్నిచ్చి నా ఇండియా ట్రిప్‌ని చాలా ఆనందదాయకంగా మలచారు.

నేను అమెరికా వచ్చేటప్పటికి నా వీసా ఇక 6 రోజులు మాత్రమే పరిమితి ఉంది. నన్ను ఇక్కడ అధికారులు ప్రశ్నించారు. 6 రోజుల తరువాత వెళ్లిపోతావా? అని. నేను ఎక్స్‌టెన్షన్ పేపర్లు చూపించాను. అయినా, అతను వేరే అధికారితో మాట్లాడి, వారు కొద్దిసేపు చర్చించుకొని సరే అని అంగీకరించి వెళ్లమన్నారు. ఇలా గురువుగారు మమ్మల్ని ఏ సమస్య లేకుండా ఇక్కడకు తీసుకు రావడం, ఆయన రక్షణ ద్వారా ఆనందానుభవాలను ఇస్తూనే ఉన్నారు. ఇలాగే ఆయన అనుగ్రహ ఆశీస్సులు ఎప్పుడూ ఉండాలని బాబాను కోరుకుంటూ బాబా, గురువుగారి పాదములకు నమస్కరిస్తూ...

**రాజ్యలక్ష్మి శాఖమూరి,** ASK

# ఏది మార్గం?

"ఇది బ్రాహ్మణ మసీదు. ఈ బ్రాహ్మణుడు లక్షలాది మందిని శుభ్రమార్గాన నడిపించి, చివరికి గమ్యం చేరుస్తాడు". ఏ ఒక్క మత సాంప్రదాయానికి చెందక, ప్రపంచంలోని మహాత్ములందరూ ఆచరించి బోధించిన విశ్వజనీనమైన ఆధ్యాత్మిక సాంప్రదాయం – సాయి మార్గం, మరో మాటలో సాయిపథం అంటే సద్గురు పథం. విశ్వజనీనమైన ఈ మార్గం ప్రతీ మనిషి జీవితానికి ఒక చుక్కానిగా సాయి అనే గమ్యం చేర్చుతుందనడంలో సందేహం లేదు. సాయి బిడ్డలుగా మనక వారి పట్ల ఉన్న ప్రేమను వ్యక్తం చేసుకోవడంలో ఏవో తెలియని అడ్డంకులు, ఆ అడ్డంకులను తొలగించుకోవడానికి గురుదేవులు చెప్పే మార్గం, ఉపకరణాలు – సత్సంగం, నామజపం, ధ్యానం, పారాయణ.. ఇత్యాదులు. ఈ సాధనోపకరణాలలో ఏది గొప్పదంటే దీని ఔన్నత్యం దానిదే. విశ్వజనీనమైన ఈ మార్గంలో ఈ ఉపకరణాల ప్రాధాన్యతను విశ్లేషించుకుందాం.

**అన్ని దారులూ అక్కడికే!**

పూజలు చేస్తూ భగవద్భావనలో ఆనందంగా గడుపుతుంటే వారి వద్దకు మరో సాధకుడు వచ్చి, ఇవన్నీ వృథా! అన్నిటికన్నా గొప్పది మంత్రజపం. కనుక పూజలు చాలించి జపం చేసుకో అంటాడు . సరేనని ఇతడు పూజలు చాలించి, జపమార్గానికి మరలి సాధన చేసుకుంటూ ఉండగా, మరొకాయన విచ్చేసి "మంత్రాలకు  చింతకాయలు రాలవు". కనుక ధ్యాన మార్గంలో ప్రవేశించాలి అంటాడు. అటువంటి ధ్యాన సాధనలో ప్రవేశించాక, మరొకరు విచ్చేసి, జపం, ధ్యానం ఇవన్నీ కర్మలే, కర్మలు చేస్తున్నంతకాలం బంధితుడవుతుంటావు, అందుకే జ్ఞానమార్గంలోకి రా అంటాడు. ఆలయాలు, క్షేత్రాలు అవసరం లేదంటాడు. మరొకరు యోగమే గొప్పదని, ఇంకొకరు సంకీర్తనయే గొప్పదని, పరమసాధనమని ఇలా ఏ మార్గంలోనూ పరిణతి చెందనివ్వకుండా బుద్ధిని అయోమయంలో, సందిగ్ధావస్థలో పడేట్లు చేస్తారు. అన్ని సాధనలు మానేసి, హాయిగా భౌతికవాదంలో బ్రతకడం మేలు అనే దానికి హేతువులవుతాయి. ఈ సందిగ్ధాలు, సందేహాలు నిజానికి ప్రతి సాధనా పథమూ గొప్పదే. అన్నీ ఒక శాస్త్రీయ పద్ధతిననుసరించి ఏర్పడినవే. ప్రవృత్తి, స్థాయిల ననుసరించి, వారు ఒక పథాన్ని ఎంచుకొని, గమ్యాన్ని చేరుకునేందుకు వీలవుతుందే కాని, ఒకటి గొప్ప, ఇంకొకటి తక్కువ కాదు. అన్ని సాధనామార్గాలు గొప్పవేనన్న విషయావగాహన మనకు కలిగించేందుకు భాగవతులు, సాధనలో పరిపూర్ణత సాధించిన వారి జీవన గమనం మనకు నిరూపణలు. సంకీర్తన మార్గంలో భక్తి యోగాన్నవలంబించి, పరిపూర్ణత నొందిన వారిలో కబీరు, రామదాసు, త్యాగరాజు చైతన్య మహాప్రభువు వంటి వారున్నారు. యోగమార్గంలో పతంజలి ఆచార్యుల వారు, వారిననుసరించిన యోగీశ్వరులు, ఇలా ధ్యాన, జ్ఞాన జపసాధనా మార్గాలనవలంబించి, పరిపూర్ణత పొంది, ముందు తరాల వారికి చుక్కానిగా భాషించిన మహాత్ములెందరో ఉన్నారు. ఇలా ప్రతి మార్గంలో

వైభవాన్ని రుజువు పరచిన వారిని గమనిస్తూ, వారు చెప్పిన సూచనల మేరకు అనుసరించవలసిన సాధనను అనుసరిస్తే పరిపూర్ణతను పొందగలము. అలాకాక, ఒకదాని నుండి మరోదానిలోనికి మళ్లుతూ ఉంటే, .... పొద్దు గడిచిపోతుంది, గమనం క్రమంగా దూరమవుతుంది. సాధకునికి సాధన యందు శ్రద్ధ యేర్పడేలా శుద్ధి, సిద్ధి (Clarity & Achievement) కలిగేలా చేయడమే మహాత్ముల కర్తవ్యం. ఏ మార్గంలో సాధన చేస్తున్నారో, ఆ మార్గానికి సంబంధించిన సంప్రదాయాలను, పద్ధతులను విస్మరించరాదు. ఆమార్గాలన్నీ ఒకదానికొకటి ప్రత్యామ్నాయాలు కావు. అవి పరస్పర పరిపూరకాలు. ఈ విషయాన్ని సోదాహరణగా తెలుసుకోవాలంటే ఒక చిన్న కథను చూద్దాం.

**భగవద్దర్శనానికి మార్గాలు** : ఒకసారి ఒకడు బావి త్రవ్వుదామనుకున్నాడు. మరొకర్ని సలహా అడిగితే ఒకచోట త్రవ్వమని చెప్పాడు. 15 అడుగుల లోతు త్రవ్వాక, నీళ్లు పడకపోయేసరికి అతడు నిరాశ చెందాడు. ఇంతలో అక్కడికి మరొకడు వచ్చి, అతడి తెలివి తక్కువ ప్రయత్నాన్ని హేళన చేసి, తనకు తోచిన మరోచోట త్రవ్వమన్నాడు. అతడు అక్కడ త్రవ్వడం మొదలుపెట్టాడు. ఈసారి 20 అడుగుల లోతు త్రవ్వాడు. అయినా నీరు పడలేదు. ఇంకొకడు ఇంకొకచోట త్రవ్వమన్నాడు. అక్కడ 30 అడుగులు త్రవ్వాడు. అయినా నీరు పడలేదు. నిరాశ నిస్పృహలతో ఆపని వదిలేసి వెళు తుండగా 3వ వాడు వచ్చి ఇలా చెప్పాడు. “నాయనా! నీవు ఇప్పటిదాకా తప్పుదారి పట్టడం వలన నీవంత కష్టపడినా నీశ్రమ వృధా అయ్యింది. దయచేసి నాతో రా! నేనొక ప్రదేశం చూపిస్తాను. అక్కడ నీవు పారతో భూమిని ముట్టుకుంటే చాలు. నీరు వరదలా ప్రవహిస్తుంది. నీళ్లు పడతాయన్న ఆశను చంపుకోలేక వాడు ఆ ప్రదేశానికి వెళ్లి త్రవ్వడం ప్రారంభించాడు. ఈ సారి నిరాశే ఎదురయ్యింది. ఇక తాను చేసే పనిని పూర్తిగా మానివేశాడు. అప్పటి దాకా అతడు నాలుగుచోట్ల కలిపి 80 అడుగుల లోతు త్రవ్వాడు. అతనికే కనుక ఓపిక, పట్టుదల ఉండి, ఒకేచోట దానిలో సగం లోతు త్రవ్వినా తప్పకుండా నీరు లభించేది. అదే బాబా అడిగిన సంతోషంతో కూడిన సహనం అనే పైసా దక్షిణ విలువ. ఆ సహన లోపం వల్ల దేనిలోనూ పరిపూర్ణత సాధించకుండా ఒక దాని వెంట ఒకటికి మరలుతూ, చివరకు నిస్పృహతో అసలు సాధననే వదిలేస్తాం. బాబా అడిగిన సహనమనే దక్షిణతో గురువుగారు చెప్పే ఒక ధ్యేయ లక్ష్యంతో ఒకే మార్గం మనలను గమ్యం చేరుస్తుంది.

స్వధర్మాన్ని (తాను నమ్మిన మార్గాన్ని) శ్రద్ధతో ఆచరించేవాడు తప్పక సిద్ధిని పొందుతాడని, పరధర్మం గొప్పదిగా కనిపించినా, తన సాధనా మార్గం నుండి మరలనవసరం లేదని, అద్భుతంగా బోధించారు మహాత్ములు. ఇదేవిధంగా కొందరు ఒక దైవం పట్ల నిష్ఠ కలిగి ఉన్నపుడు మరొక దేవతారాధకుడు వచ్చి, ఆ దైవాన్ని పూజిస్తే ముక్తిరాదని, తన దైవాన్నే ఆరాధించమని బోధించడం తగదు. ఎవరెవరు ఏయే రూపాలను ఆరాధిస్తారో వారికి వాటియందు శ్రద్ధను అచంచలంగా సిద్ధింపచేసారు మహాత్ములు. మరి మన బాట కూడా అదే కావాలిగా! ఆయనకు తగ్గ బిడ్డలం కదా!

యోగాన్నాశ్రయించిన జ్ఞానదేవులు, నామజపాన్నాశ్రయించిన నామదేవులు ఇద్దరూ దాహం తీర్చుకొనేందుకు నీటిని పొందగలిగారు. మనం నమ్మిన, ఆశ్రయించిన మార్గం పట్ల విశ్వాసం ఎలా ఉండాలో తెలిపే కథను తెలుసుకుందాం. ఒకనాడు జ్ఞానదేవులు, నామదేవుల వారి అంతరంగిక ప్రగతిని పరీక్షించాలనుకుంటారు. ఇద్దరూ నామ ప్రచారం చేయు నిమిత్తం ఒక గ్రామానికి పోతుంటారు. మధ్యలో ఇద్దరికీ దాహం వేస్తుంది. ఒక బావి వద్దకు వెళతారు. ఆ బావి చాలా లోతుగా ఉంది. చేదడానికి త్రాడు, బొక్కెన లేవు. జ్ఞాన దేవులు ఒక చిలకగా మారి బావిలో దిగి నీరు త్రాగి వచ్చి, చూసావా! యోగాభ్యాసము ద్వారా ఎలాంటి


శక్తులు వస్తాయో గమనించావా? నామాన్నాశ్రయించిన నీవు ఇప్పుడు చేయగలిగినదేమిటి? నామదేవులు జ్ఞానదేవుల వారికి నమస్కరిస్తూ "మీరు సర్వజ్ఞులు. మీకు తెలియనిది లేదు. భగవంతుని నేత్రాలు విశ్వాన్నంతా వీక్షిస్తున్నాయి. అర్హతననుసరించి అనుకూలత ఏర్పడుతుంది. నాకు నీరు ఇవ్వాలనుకుంటే ఎలా ఇవ్వాలో ఆయనకు తెలుసు. ఈ దేహం ఎంతవరకు ఉంచదలచాడో అంతవరకు అన్నీ సమకూర్చగలవాడే ఆయన. మధ్య నా కర్తవ్యమేముంది? భగవానుని దయతో బ్రతుకుతున్నాను. ఆయన దయతో మరణిస్తాను". అని తానెన్నుకున్న సాధనా మార్గమైన నామజపం చేయసాగాడు. బావి నుండి నీళ్లు పైకి వచ్చాయి. నామ దేవులవారు అడుగయినా ముందుకు వేయకుండా నిలబడిన చోటనే వుండి నీళ్ల త్రాగారు. మనమాశ్రయించుకున్న మార్గం తెలుసుకోవాలి, ఇతర మార్గాల వైభవం మనలను మన మార్గంలో మరింత పటిష్ఠపరిచే విధంగా ఉండాలి. – 'సత్యసంకలనాల నుండి'

## సాయి భక్తులకు బ్రతుకంతా శోభప్రదం

"My Mission is to give blessings" – "అనుగ్రహించడమే నా పని" "భక్తులకు వెహికంగానూ, ఆముష్మికంగాను లాభం చేకూర్చడానికే మహాత్ములున్నది అన్న సాయి మాటలు తన ప్రతి భక్తుని విషయంలోనూ మనకు గోచరించే సజీవ వ్యాఖ్యానాలు. మనం గుర్తుంచుకోవాల్సిన విషయమల్లా గురుదేవుల ఈ మాటలనే "Baba knows the best what you need" – "మనకేది మంచి సాయికి తెలుసు". ఈ భావన మనలో అంకురించిననాడు మన జీవితాలు ఆనందమయమే, అందు సందేహం లేదు – ఎందుకంటే సద్గురు తత్త్వంలో "అసాధ్యమన్నది లేనే లేదు" అప్పటి వరకు అసలు లేని విభాగానే నార్కే కోసం ప్రారంభిస్తే, ఈ బిడ్డ అభ్యున్నతికై మూడో సంవత్సరంలో ఎం.టెక్. సీటు ఇప్పించారు గురుదేవులు. అనుభవం.. ఆనందం..

నా పేరు ప్రమీల. నేను బి.టెక్ పూర్తి చేసాను. యమ్.టెక్. చేయాలని కోరిక. రెండుసార్లు గేట్ వ్రాసాను. కానీ రెండుసార్లు గేట్ ప్రవేశ పరీక్షలో అర్హత పొందలేకపోయాను. నేను ఇక యం.టెక్ చేయలేనేమో అని అనుకున్నాను. కానీ బాబా నాకు మూడు సంవత్సరాల తరువాత యమ్.టెక్ చదివే అవకాశాన్ని కలిగించారు. అది కూడా నేను ఉండే ఊర్లోనే. ఇది నిజంగా బాబా గురువుగార్ల అనుగ్రహ ఆశీస్సుల వల్లనే జరిగింది. మాకు మొత్తం 4 సెమిస్టర్లు ఉంటాయి. అందులో 2 సెమిస్టర్లు అంటే ఒక సంవత్సరం ప్రాజెక్టు వర్కు చేయాలి. అది కనుక వేరే ఊర్లో వస్తే ఆ సంవత్సరం మొత్తానికి హాస్టల్ ఖర్చులు, ఇండస్ట్రీలో నెలసరి ప్రాజెక్టు వర్క్ కోసం మేము చాలా డబ్బు చెల్లించవలసి ఉంటుంది. ఇంకొక సమస్య ఏమిటంటే ఏ కంపెనీ వారైనా 3 నెలల కన్నా ఎక్కువ ప్రాజెక్టు వర్క్‌కి అనుమతి ఇవ్వరట. సెమిస్టర్ ఫీజే కాకుండా కంపెనీలో ప్రాజెక్ట్ వర్క్ చేయడానికి అయ్యే ఖర్చు, హాస్టల్ ఖర్చు తలచుకుంటే నాకు భయం వేసింది. ఇంకొక విషయం ఏమిటంటే మేము ప్రాజెక్ట్ వర్క్ ఎక్కడ చేయాలి, ఏమి చేయాలి అనేది మాకు కేటాయించిన గైడ్ మీద ఆధారపడి ఉంటుంది. నేను బాబాని, గురువుగారిని ప్రార్థిస్తూ ఉండేదాన్ని. బాబా మీ ఆశీస్సులు ఇచ్చి, నాకు వచ్చే గైడ్ నాకు కాలేజీలో .... మీద లేక లోకల్‌గా ప్రాజెక్ట్ వర్క్‌ను కేటాయించాలి అని కోరుకున్నాను. బాబా నేను కోరుకున్న విధంగా నాకు గైడ్‌ను, ప్రాజెక్ట్ వర్క్‌ను ఇచ్చారు. మా గైడ్ నన్ను ప్రాజెక్ట్ వర్క్ కాలేజీలో .... మీద చేయమన్నారు. ఇదంతా బాబా, గురూజీల ఆశీస్సులుగా భావిస్తున్నాను. అంతే కాకుండా ప్రాజెక్ట్ వర్క్ చేస్తున్నపుడు కూడా బాబా నాకు ఎన్నోసార్లు సహాయం చేస్తూనే ఉన్నారు. వారి ఆశీస్సులతో నా యమ్.టెక్. విజయవంతంగా పూర్తయింది. ఇలా ఎల్లప్పుడూ మాతోనే ఉంటూ, మా బాగోగులు చూసుకుంటూ, మమ్మల్ని కాపాడుతున్న బాబా, గురువుగార్ల యొక్క పాదములకు సాష్టాంగ నమస్కారములు చేసుకుంటూ సెలవు తీసుకుంటున్నాను... **– ప్రమీల, విజయవాడ.**

ఒక పిల్లవాడు సాయిని సమీపించి, "బాబా కొందరు భక్తులు మీరు దైవం కాదని, దైవం చేత కొన్ని దివ్య శక్తులను పొందిన సాధువులని, అంటున్నారు!" అని వాపోయాడు. సాయి, "వారన్నది నిజమే! నేను పేద ఫకీరును మాత్రమే"!! అన్నారే గాని అలా పల్కిన భక్తుల అజ్ఞానంపట్ల, అవిధేయత పట్ల ఆగ్రహించలేదు.



జవహర్‌ఆలీ వంటి కపటగురువు బాబా తమ శిష్యుడని చాటుకున్నా, ఆయన వినమ్రతతో ఆమోదించి అలానే వ్యవహరించడం గమనార్హం. తన భక్తుల ముందు తమ గురుపదవిని చాటుకోవాలని, నిలుపుకోవాలని తాపత్రయపడలేదు. సాయియంతటి మహనీయుడే ఇలా నడుచుకొంటే సాయి భక్తుల మని చెప్పుకునే వారెందరో తద్భిన్నంగా నడచుకోవడం పరిశుద్ధమైన సాయీ సాంప్రదాయాన్ని భ్రష్టు పరచడమే అవుతుందని మనం గుర్తించాలి.

# భజన

భజనకు ప్రాణం భావం. భజనంటే బృందగానం కాదు! మన
ఇష్టదైవం పట్ల మనకున్న ప్రేమకు, ఆ ప్రేమ ఇంకా అనంతంగా,
అనన్యంగా పెరగాలన్న ఆర్తికి, ఆ ఆర్తి మన హృదయాలలో
నిగిడిస్తున్న రసస్పందనకు వ్యక్తీకరణ రూపమే భజన.



మహోమహాత్మకమైన శ్రీసాయి రూపం, అడిగినంతనే గ్రక్కున
వరములిచ్చెడి శ్రీసాయి అవ్యాజ ప్రేమ సరళి, ఎంత ఆలోచించి
నా 'అంతు'పట్టని నిగూఢమైన శ్రీసాయితత్త్వం, ఆ తత్త్వశోధనలో
ముగ్ధమైన మన హృదయాలు, అలా తన్మయమైన ముగ్ధతలో
దగ్ధమయ్యే మన వ్యక్తిత్వపు పరిమితులు...
– ఇదే భజనకు మొదలు – చివర.

– శ్రీ బాబాజీ